మంజీరలో ఇసుక మాఫియా!

- అనుమతుల చాటున అక్రమ దందా
- చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ కీలక నేత
- వే బిల్లులు చాటున అక్రమ రవాణా
- కాంగ్రెస్‌లో రెండు గ్రూపుల పంచాయితీ

మంజీర నది నీటిమట్టం తగ్గిన దృశ్యం.. మంజీర నది పరివాహక ప్రాంతంలో బీర్కూర్ క్వారీ వద్ద ఇసుక తవ్వకాలకు సిద్ధంగా ఉన్న పొక్లెయినర్లు

నిజామాబాద్, జూలై 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంజీర పరీవాహకంలో ఇసుక దోపిడీ అడ్డుఅదుపు లేకుండా సాగుతున్నది. అనుమతుల పేరిట ఇష్టారీతిన దందా నడుస్తున్నది. అధికార యంత్రాంగం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ కముందు మంజీరలో ఇసుక తవ్వకం పారదర్శకంగా జరిగేది. టీజీఎండీసీ ద్వారా అనుమతులిచ్చిన క్వారీల్లోనే ఇసుక తవ్వేవారు. గత ఏడు నెలలుగా అధికార పార్టీ కీలక నేతలు, వారి అనుయాయులు దోపిడీ పర్వానికి తెర లేపి, ఇసుక దందాతో జేబులు నింపుకొంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల మేరకు రెండు క్వారీలను టీజీఎండీసీ తెరిచింది. పట్టా భూమిలోనూ మరో క్వారీకి అనుమతులిచ్చింది. ఇక్కడినుంచి అడ్డూ అదుపు లేకుండా ఇసుక దందా చేసినట్టు సమాచారం. వే బిల్లులు లేకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహారాలను నడిపించినట్టు తెలుస్తున్నది. ఒకచోట అనుమతి పొంది మరోచోట తవ్వకాలు జరపడంతోపాటు అనుమతికి మించి లారీల్లో ఇసుకను తరలిస్తూ ఒక ట్రిప్పుకు రెండు ట్రిప్పులంతా లాభాలను ఆర్జించారు. మంజీరకు ఇరువైపులా ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే ఇదంతా జరుగగా ఇసుక పంచాయితీ విషయంలో ఒప్పందాలు చెడి చివరకు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునేవరకు వెళ్లిందని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.

రికవరీ చేసేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంజీరాలో కొత్తగా క్వారీలకు అనుమతులు మంజూరు చేయలేదు. పాత అనుమతులను పునరుద్ధరించి ఇసుక వ్యాపారాన్ని టీజీఎండీసీ, పట్టాదారుల భూముల్లో కొనసాగించింది. ఇందులో అక్రమాలున్నట్టు ఫిర్యాదులు రావడంతో ఉన్నతస్థాయిలో విచారణ చేపట్టగా, రూ.12 కోట్లు విలువ చేసే ఇసుకను అక్రమంగా తవ్వినట్టు నిర్ధారించారని సమాచారం. టీజీఎండీసీ ఈ నెల 23న విడుదలచేసిన ప్రకటన ప్రకారం.. దాదాపు 60 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేందుకు అనుమతులు తీసుకుని అక్రమంగా నాలుగు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వినట్టుగా నిర్ధారించినట్టు సమాచారం. ఈ విషయాన్ని నిర్ధారించేందుకు టీజీఎండీసీ అధికారులు నిరాకరిస్తున్నారు. ఇసుక వ్యాపారంలో ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని విచారణ బృందం గుర్తించడంతో క్వారీల్లో పనిచేసే పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేసినట్టు తెలుస్తున్నది. టీజీఎండీసీ, ప్రైవేటు పట్టాలో ఇసుక తవ్వకాలకు క్వారీలను దక్కించుకున్న వ్యాపారులకు అనుమతులు రద్దు చేసినట్టు తెలిసింది. ఇందులో కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్, సుధాకర ఇన్‌ఫ్రాటెక్, సాయిడాక్స్ ఇంజినీర్స్ కంపనీలు ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో వీరిపై రికవరీ అస్త్రాన్ని ప్రభుత్వం ప్రయోగిస్తుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

హస్తంలో కొత్త పంచాయితీ

ఇసుక దోపిడీలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఒక మంత్రి అండదండలతో పలువురు ఇసుక వ్యాపారులు రంగప్రవేశం చేసినట్టు చెప్పుకుంటున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక కీలక నేత, కొత్తగా గెలిచిన ఒక ఎమ్మెల్యేకు తోడుగా బాన్సువాడలో ఓడిన మరో మాజీ ఎమ్మెల్యే సైతం అందిన కాడికి దండుకున్నట్టు ఆరోపణలున్నాయి. సొంత నియోజకవర్గాన్ని వదిలి బాన్సువాడలో వాలిన ఒక మాజీ ఎమ్మెల్యే తనదైన శైలిలో ఇసుక వ్యాపారంలో కాలు పెట్టినట్టు సమాచారం. తాజాగా మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో తమ వ్యూహం బెడిసి కొట్టడంతో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్టు కాంగ్రెస్ వర్గాలు కోడై కూస్తున్నాయి. కాంగ్రెస్‌లో రాజుకున్న కొత్త పంచాయితీ వల్ల ప్రభుత్వం ఎట్టకేలకు విచారణ చేయించి క్వారీలను మూయించినట్టు తెలుస్తున్నది. పాత ప్రభుత్వంలో అనుమతులు పొందిన ఇసుక వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయడంతోపాటు కొత్తగా మరోసారి క్వారీల నిర్వహణకు టెండర్లు పిలిచే అవకాశాలున్నాయని సమాచారం. అయితే హస్తంలో రాజుకుంటున్న ఇసుక పంచాయితీతో మంజీర పరీవాహకంలో ఎవరికి పెత్తనం అప్పగిస్తారో? అన్న చర్చ జోరుగా నడుస్తున్నది. తాజాగా పార్టీ మారిన ఎమ్మెల్యే, ఓడిన మాజీ ఎమ్మెల్యే, కొత్త ఎమ్మెల్యేతోపాటు కామారెడ్డికి చెందిన కీలక నేతల మధ్య పోటాపోటీగా ఇసుక పంచాయితీ కొనసాగుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రస్తుతం క్వారీల మూతతో మంజీరలో ఎలాంటి హడావుడి లేదు. రాత్రివేళలో మాత్రం ట్రాక్టర్లలో అక్రమంగా తరలింపు జరుగుతున్నట్టు సమాచారం.

అధికార పార్టీ నేతల హల్‌చల్

కామారెడ్డి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఒక కీలక నేతకు సమీప బంధువైన ఒక మాజీ ఐపీఎస్ అధికారి తనయుడు ఇసుక దందాలో చక్రం తిప్పుతున్నట్టు సమాచారం. కేరాఫ్ హైదరాబాద్‌గా చెప్పుకునే సదరు వ్యక్తులు మంజీరలో ఇసుక క్వారీ అనుమతులను చేతబట్టి దోపిడీ చేస్తున్నారు. వీరి ఆగడాలకు తెరవెనుక అధికార అండదండలున్న ఒక నేత ఉన్నట్టు తెలుస్తున్నది. పోలీసులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖలకు చెందిన అధికారులుగా తమ వారికే పోస్టింగ్‌లు ఇప్పించుకొని ఇసుక దందాను జోరుగా సాగిస్తున్నారు. ఏరికోరి కళంకిత అధికారులకు మంజీరా పరీవాహకంలో పోస్టింగ్‌లు ఇచ్చి దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్‌లోని ఒక వర్గం కోడై కూస్తున్నది. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే ఒకవైపు, కీలక నేత మరోవైపు రంగంలోకి దిగడంతో మిగిలిన చోటా మోటా నేతలంతా నిట్టూరుస్తున్నట్టు సమాచారం. పదేండ్లకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కీలక నేతలే పదవులు దక్కించుకుంటూ, ఇసుక దందాలు చేస్తూ మిగిలిన వారి పొట్ట కొడుతున్నారని వాపోతున్నారు. కామారెడ్డి జిల్లాలో కీలక నేతతో పాటు వారి బంధువుల ఇసుక దందాపై ఏఐసీసీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం.

అప్పులు భారమై రైతు ఆత్మహత్య

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఘటన

కోనరావుపేట, జూలై 29 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన రైతు తాళ్లపల్లి సత్తయ్య (40) అప్పులు బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తయ్య ఎకరంతోపాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని, పెట్టుబడి కోసం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందిన ఆయన ఆదివారం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పురుగులమందు తాగాడు. సిరిసిల్ల దవాఖానకు తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రేపు కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): రైతుల శ్రేయస్సును విస్మరించిన 2024-25 బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న జిల్లా, మండల కేంద్రాల్లో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్లు సాగర్, పద్మ మాట్లాడుతూ.. ఆహార సబ్సిడీ, వడ్డీ మాఫీ, వ్యవసాయ పరిశోధనలకు సరిపడా నిధులు పెంచలేదని ఆరోపించారు.

లక్షన్నర మాఫీ 7 లక్షల మందికే!

మొదటిపేజీ తరువాయి...

చేయడం కోతలకు అద్దం పడుతున్నది. తొలివిడత రూ. 6,098 కోట్లతో 11.42 లక్షల మంది రైతులకు లక్ష వరకు రుణాలు మాఫీ చేసింది. రెండో విడత రూ.6,500 కోట్లతో 7 లక్షల మందికి లక్షన్నర వరకు రుణాలు మాఫీ చేయనున్నది. రెండు విడతల్లో కలిపి కేవలం 18.42 లక్షల మందికే రుణమాఫీ వర్తిస్తున్నది. రెండు విడతల్లో కలిపి లక్షన్నర వరకు కేవలం 18 లక్షల మంది రైతులే ఉంటారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లెక్కను నిశితంగా పరిశీలిస్తే అర్హుల్లో భారీగా కోతలు పెట్టినట్టు తెలుస్తున్నది.

42లక్షల మందికి మాఫీ చేస్తామన్న ప్రభుత్వం

మొత్తం 42 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన లక్ష, లక్షన్నర వరకు రుణాలున్న 18.42 లక్షల మందికి రుణమాఫీ చేయనుంది. మిగిలినవారిలో లక్షన్నర నుంచి రూ. 2లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతులు 23.58 లక్షల మంది ఉండాలి. కానీ అంత మంది ఉంటారా? అని అధికారులే సందేహిస్తున్నారు. మహా అయితే 10 లక్షల మంది ఉంటే ఎక్కువనే అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం మొత్తం 28 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేస్తున్నదని తేటతెల్లమవుతున్నది.

అంతా రహస్యమే.. జిల్లాలకు అందని జాబితాలు

రుణమాఫీపై ప్రభుత్వం ఆదినుంచీ రహస్య ధోరణిని అవలంబిస్తున్నదనే విమర్శలున్నాయి. అర్హుల సంఖ్యను వెల్లడించడం, జాబితా విడుదల చేయడంలో గోప్యత పాటిస్తున్నది. తొలివిడత ముందు రోజు రాత్రి జాబితా విడుదల చేసిన ప్రభుత్వం రెండో విడత మరీ దారుణంగా సోమవారం రాత్రి వరకూ జాబితాలను జిల్లాలకు అందించలేదు. దీంతో క్షేత్రస్థాయి అధికారుల్లో గందరగోళం నెలకొన్నది. తమకు జాబితా అందకపోవడంతో ఎవరికి రుణమాఫీ అయిందో? ఎవరికి కాలేదో? ఎలా చెప్పాలని అధికారులు వాపోతున్నారు.

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌లో బ్యాంకు పాస్ బుక్కులు, రుణపత్రాలు చూపుతూ నిరసన తెలుపుతున్న రైతులు, సీపీఐ నాయకులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- గన్నేరువరంలో రైతులతో కలిసి సీపీఐ నిరసన

గన్నేరువరం, జూలై 29: రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌లో రుణమాఫీ కాని రైతులతో బ్యాంకు పాస్ బుక్కులు, రుణపత్రాలు చేతిలో పట్టుకొని సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులందరికీ ఒకేసారి రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు విడతల వారీగా కొందరికే చేస్తున్నారని మండిపడ్డారు. రూ.లక్ష లోపు రుణం తీసుకున్నవారికి మాఫీ చేస్తామని చెప్పినా.. అర్హులైన వందలాది మందికి మాఫీ కాలేదని, లిస్టులో పేరు రాలేదని దుయ్యబట్టారు. రుణమాఫీ గురించి ఎవరిని అడగాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులను వెంటనే గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని డిమాండ్ చేశారు.

సందేహాలుంటే ఏఈవోలు, బ్యాంకర్లను సంప్రదించాలి

రెండో విడతలో భాగంగా మంగళవారం ఉదయం లక్షన్నర వరకు ఉన్న రైతుల రుణాలను మాఫీచేయాలని నిర్ణయించాం. సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేస్తారు. రుణమాఫీపై సందేహాలున్న రైతులు ఏఈవోలను, బ్యాంకర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి.

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి

రుణమాఫీ కాలేదు.. న్యాయం చేయండి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు రైతు ఫిర్యాదు

ఎడపల్లి, జూలై 29: పంట రుణమాఫీ విషయంలో న్యాయం చేయాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌కు చెందిన రైతు మాల పెద్దులు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశాడు. సోమవారం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను, తన భార్య పేరిట రూ.98 వేల రుణం తీసుకున్నామని, తమకు అది మాఫీ కాలేదని వివరించాడు. దీనిపై ఎడపల్లి సొసైటీ కార్యదర్శి రాజారాం, ఏవో సిద్ది రామేశ్వర్‌ను అడిగితే.. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉండటంతో మాఫీ కాలేదని చెప్పినట్టు తెలిపారు. మూడు బ్యాంకుల నుంచి రూ.98 వేల రుణమే తీసుకున్నామని తెలుపగా.. అధికారులు ఆన్‌లైన్‌లో వివరాలు చెక్ చేశారని పేర్కొన్నాడు. తమ పేరిట గట్కు చిన్న సాయిలు రూ.1.20 లక్షల రుణం తీసుకున్నట్టు చూపిస్తున్నదని, అందుకే రుణమాఫీ వర్తించలేదని ఏవో చెప్పారని వివరించాడు.

- పింఛన్ కోసం వృద్ధుల ఎదురుచూపు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లను నెలనెలా ఇవ్వకపోవడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పింఛన్ మీదనే ఆధారపడి బతుకుతున్న పండుటాకుల ఇబ్బందులు వర్ణనాతీతం. పింఛన్ డబ్బులు వస్తే మందుగోళీలు తెచ్చుకుంటామని, రెండు నెలలుగా పింఛన్ రాక ఇబ్బందిగా ఉందని వృద్ధులు వాపోతున్నారు. వితంతువులు, దివ్యాంగులు సతమవుతున్నారు. బీఆర్ఎస్ సర్కారులో నెలనెలా పింఛన్ సజావుగా వచ్చేదని గుర్తుచేశారు. -సంగారెడ్డి ఫొటోగ్రాఫర్

- పింఛన్ కావాలంటే.. 20 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేవోజిపేట తపాలా కార్యాలయం పరిధిలోని బుట్టాపూర్‌లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కలిపి 300 మంది పింఛన్ దారులు ఉన్నారు. ఇందులో నుంచి 45 మంది పేర్లు సాంకేతిక సమస్యతో కడెం మండలంలోని ఉడుంపూర్ తపాలా కార్యాలయానికి వెళ్లాయి. దీంతో ఈ 45 మంది మూడు నెలలుగా 20 కిలోమీటర్ల దూరంలో ఉడుంపూర్‌కు వెళ్లి పింఛన్ డబ్బులు తెచ్చుకుంటున్నారు. అక్కడికి వెళ్లిరావడానికి ఒక్కొక్కరికి దాదాపు రూ.200లకుపైగా ఖర్చవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు తమ గోడును అర్థం చేసుకుని తమ పేర్లను బుట్టాపూర్ పరిధిలోకి మార్చాలని పింఛన్‌దారులు కోరుతున్నారు. - దస్తురాబాద్

పది రోజులైనా నిందితులను పట్టుకోరా?

- పోలీసుల అలసత్వాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

భీమ్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పక్కకు తరలించేందుకు యత్నిస్తున్న పోలీసులు

భీమ్‌గల్, జూలై 29: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నేతలు సోమవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో రాస్తారోకో చేశారు. దాడి చేసి పది రోజులవుతున్నా ఇసుక మాఫియా సభ్యుల ఆచూకీ దొరకలేదా? అని మండిపడ్డారు. ఇటీవల కప్పల వాగు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బీఆర్ఎస్ నేతలు కర్నె మహేందర్ తదితరులు అడ్డుకున్నారు. మహేందర్‌పై ఇసుక మాఫియా కట్టెలు, రాళ్లతో దాడి చేసింది. నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సై హరిబాబు వచ్చి నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పినా రాస్తారోకో కొనసాగించారు. దీంతో వారిని పోలీసులు తప్పించే క్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్ చొక్కా చినిగిపోయింది. ఇసుక మాఫియా సభ్యులను కచ్చితంగా అరెస్టు చేస్తామని ఎస్సై మరోసారి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నాగార్జునసాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం ప్రాజెక్టును ముంచెత్తుతున్న వరద
- మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



శ్రీశైలం డ్యాం గేట్ల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: నాగార్జునసాగర్ దిశగా కృష్ణమ్మ పరుగులు తీస్తున్నది. భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. కర్ణాటకతోపాటు తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగుతున్నది. ఇప్పటికే ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యానికి చేరుకోగా దిగువకు వరదను విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్ట్‌కు 3.15 లక్షల క్యూసెక్కుల వరద ఎగువ నుంచి వస్తున్నది. దీంతో డ్యాం 43 గేట్లను తెరిచి 3,11,575 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్‌కు 1.62 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్టును భారీ వరద ముంచెత్తుతుండటంతో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు 3 క్రస్ట్ గేట్లు తెరుచుకున్నాయి. దాంతో ఇప్పటికే విద్యుత్తు ఉత్పత్తి ద్వారా వస్తున్న నీటితో కలిపి మొత్తం 1,62,466 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరుకుంటున్నది. నాగార్జునసాగర్ జలాశయంలో వారం రోజుల్లో 9 అడుగుల నీటి మట్టం పెరిగి సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 512.60 అడుగులకు చేరుకున్నది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, నీటి నిల్వ 136.13 టీఎంసీలుగా ఉన్నది.

అన్నారం బరాజ్‌కు 7600 క్యూసెక్కులు

మహదేవపూర్/కాళేశ్వరం/కన్నాయిగూడెం, జూలై 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతూ సోమవారం సాయంత్రానికి 4,75,210 క్యూసెక్కులకు చేరుకున్నది. బరాజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

భద్రాద్రికి తప్పిన వరద గండం

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29 (నమస్తే తెలంగాణ) : 8 రోజులుగా భద్రాద్రి మన్యాన్ని ఓ కుదుపు కుదిపిన వరద ప్రవాహం ఒక్కసారిగా తగ్గిపోయింది. దీంతో భద్రాచలానికి వరద గండం తప్పింది. ఆదివారం రాత్రి వరకు మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన వరద సోమవారం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

- తండ్రిని వేధిస్తున్నారని.. టవరెక్కిన యువకుడు

తన తండ్రిని పోలీసులు వేధిస్తున్నారంటూ ఓ యువకుడు విద్యుత్తు టవర్ ఎక్కి ఆందోళనకు దిగాడు. ఎస్సార్ నగర్‌కు చెందిన కుదురుపాక వెంకటేశ్వర్లు (కేవీ స్వామి)కు, అతడి బంధువులకు మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతున్నది. వెంకటేశ్వర్లు తన బంధువులకు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నట్టు తేలింది. ఇబ్బందులకు గురిచేస్తుండటంతో రంగశాయిపేటకు చెందిన వారు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిల్స్ కాలనీ పోలీసులు వెంకటేశ్వర్లును పిలిచి వివరాలు తెలుసుకున్నారు. తన తండ్రిని పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వెంకటేశ్వర్లు కుమారుడు జయప్రకాశ్ సోమవారం ఏనుమాములలోని సబ్ స్టేషన్ పక్కన గల టవర్ ఎక్కి ఆందోళనకు దిగాడు. ఇన్‌స్పెక్టర్ రమేశ్ గౌడ్ చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో అతడు కిందకు దిగాడు.

- 'భగీరథ' పంపు ఆపరేటర్ల విధుల బహిష్కరణ

నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఖమ్మం రూరల్ మండలం చిన్నతండాలోని ఓహెచ్‌బీఆర్ పరిధిలో పనిచేసే 21 మంది మిషన్ భగీరథ పంపు ఆపరేటర్లు సోమవారం విధులను బహిష్కరించారు. జీతాల కోసం మూడు నెలలుగా మొరపెట్టుకుంటున్నా కనీస స్పందన లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో విధులను బహిష్కరించాల్సి వచ్చిందని వారు పేర్కొంటున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వాయిదాలను కూడా జమ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాళేశ్వర గంగ.. ఉప్పొంగంగ

- లింక్-2లో జల పరవళ్లు
- నంది, గాయత్రీ పంప్‌హౌసుల్లో నడుస్తున్న మోటర్లు
- 15,750 క్యూసెక్కుల పంపింగ్

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, జూలై 29 : కాళేశ్వర గంగ ఉప్పొంగుతున్నది. లింక్-2లో ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి పరుగులు తీస్తున్నది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఆదివారం వరకు నాలుగు మోటర్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగించిన అధికారులు, సోమవారం మరో మోటర్‌ను ఆన్‌చేశారు. ప్రస్తుతం 2,3,5,6,7వ పంపులు నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 15,750 క్యూసెక్కులు డెలివరి సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అండర్ టన్నెళ్లలో గ్రావిటీ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అధికారులు సోమవారం ఐదో మోటర్‌ను ప్రారంభించారు. మొత్తంగా 15,750 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరి సిస్టర్న్‌ల ద్వారా ఎగిసిపడ్డ జలాలు సుమారు 5.7 కిలోమీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా వరదకాలువకు చేరుకొని అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి.